# అభద్రత

*నా కోసం* వసంత వాకిట్లో నిలబడి వుంది. నా రాకను చూసిన వెంటనే వసంత కళ్ళలోకి ఏదో వెలుగొచ్చి చేరింది. నేనా వెలుగును చూడలేక, కళ్లలోకి కళ్ళు కలపకుండా ఇంట్లోకి నడిచాను.

"నేను రైల్వే వారి ఇంట పుట్టి పెరిగినదాన్ని. ఆలస్యంగా వచ్చినా సరే సహనంతో ఎదురు చూడ్డం నాకలవాటయిపోయింది, అవునూ ... మీరు పేపరువాళ్ళు కదా? మీ పేపరు ప్రతిరోజు వేళకి ఇంటికొస్తుంది....ఎటొచ్చీ మీరే.." వసంత అంతటి నిరీక్షణలోనూ నవ్వుతూ అంది.

"....సారీ.... వసంతా.." అంతకుమించి నా నోరు పెగల్లేదు.

"రోజూ వున్నదానికి సారీ ఎందుకండి? ఇంతకీ మీకు సెలవు దొరికిందా? లేదా? అది చెప్పండి.." కుర్చీలో కూలబడ్డ నాకు వసంత మంచినీళ్ళు అందిస్తూ అడిగింది.

"... అంటే.. ఈవాళ బడ్జెటొచ్చింది. దానిమీద అభిప్రాయాల్తో 'అనుబంధాన్ని' తీసుకురావాలి' అని చీఫ్ ఎడిటర్‌గార్నుంచి ఫోను.. అసలు ఈ విషయం చెప్పుదామని, ఇటొచ్చి వెళ్ళడానికే వీలయింది కాదు". నేనింకా ఏదో చెప్పబోయాను. కాని వసంత నాకా అవకాశమివ్వలేదు.

"...సరే ..సరేనండి.. మీరు వీలు చూసుకుని తర్వాత రండి. నే వెళ్తాను. ఇప్పటికే ఉత్తరం వచ్చి రెండ్రోజులయి పోయింది. మా అమ్మగారి ఆరోగ్యం ఎలా వుందో.. ఏమో? ఎంతో ఇదయితేగాని బెంగపడతానని ఉత్తరం రాయరు.." వసంత అప్పటికే సర్దేసి వున్న సూట్‌కేస్‌ను మరోసారి సర్దింది.

"మరిప్పుడెలా?" నాకేమీ తోచలేదు.

"ఎలా ఏమిటి? నే వెళ్తాను. మీరు వీలుని బట్టి రండని చెవుతున్నాగా" సమస్య తీరినట్టే వసంత మాట్లాడుతోంది.

"నువ్వొక్కదానవూ.."

"ట్రైనులో చాలామంది వుంటారు..."

"ఉంటారు గనుకే, మీ తమ్ముడ్ని రమ్మని టెలిగ్రామ్ చేస్తే.."

"వాడెందుకు?"

"తోడు..."

"ఇంట్లో వాడొక్కడే చెయ్యి సాయం. అయినా తొమ్మిదో తరగతి చదివే మీ తమ్ముడు వేసవి సెలవుల్లో ఇక్కడ విశాఖపట్నం నుంచి రాజమండ్రి మా యింటికి వెళ్ళివచ్చేస్తాడు గదా?!. నేను డిగ్రీ చదివాను. పెళ్ళయి రెండేళ్ళుగా కాపురం చేస్తున్నాను. వచ్చే ఏడుకి పాతిక సంవత్సరాలు వస్తాయి.."

వసంత వాదనకు దిగుతోంది. లేకపోతే లోకం ఇప్పుడెలాగుందో తెలీదూ?! పేపర్లో చూస్తోంది. ఇరుగూ పొరుగున వింటోంది. అయినా ఇలా మాట్లాడుతోందేమిటి! అంతేలే, ఇంట్లో వుంటే ప్రపంచమేమి తెలుస్తుంది?

"ఏమండీ మాట్లాడరేమండి?" వసంత నన్ను కుదిపింది.

"అదికాదు వసంతా, మన పెళ్ళయిన రెండేళ్ళలో ఒక్కసారయినా నిన్ను ఒంటరిగా పంపేనా?" నా బాధ వసంత కర్థమయినట్టు లేదు.

"ఆ అవసరం వచ్చిందో... రాలేదో, కొత్త దంపతులమయి కొంగులు ముడివేసుకు తిరిగామో, అదంతా ఎందుకు? మా అమ్మకు బాగోలేదు, నే వెళ్తున్నా... మా అమ్మని తలచుకుంటూ రోజులు గడపడం నాకు కష్టంగా వుంది. రోజా ఇలానే రేపు రేపు అంటూ గడిచిపోతోంది. నేనిప్పుడు విశాఖ ఎక్స్‌ప్రెస్సుకే వెళ్తాను" వసంత ఒకే నిశ్చయానికొచ్చినట్టు చాలా మొండిగా అంది.

"నైట్ ట్రైనుకా? రాజమండ్రి చేరేసరికి అర్థరాత్రవుతుంది".

"మనం ఇలాగే మాట్లాడుకుంటూ కూర్చుంటే తెల్లవారిపోతుంది. ఏమండీ నేనేదో ఎరగని ఊరు వెళ్లడం లేదు. నే పుట్టి పెరిగిన చోటుకి వెళ్తున్నాను. పైగా నే వెళ్ళేది రైలుకా, దిగంగానే స్టేషన్ దాటితే రైల్వే క్వార్టర్స్. గట్టిగా కేకపెడితే మా ఇంటికి వినిపిస్తుంది".

వసంతలా మాట్లాడితే ఏం చెప్పగలను? సరేనన్నాను. బయలుదేరమన్నాను. స్టేషన్ దాక వచ్చి రైలెక్కించి ఆఫీసుకు వెళ్తానన్నాను.

అప్పటికే చీకటి పడింది. ఏడు గంటలు కావడానికి - అంటే రైలుకి అర్థగంటే వుంది. నే ముఖం కడుక్కొనే లోపే వసంత సూట్‌కేసుతో సిద్ధం.

ఇంటికి తాళంవేసి ఇద్దరం ఆటో ఎక్కాం.

రైలు చేరేసరికి అర్థరాత్రి పన్నెండు దాటుతుంది. స్టేషనుకూ ఇంటికీ ఒక కిలోమీటరు కూడా వుండదు. హమ్మయ్య... అయినా పట్టాలు దాటాలి. పగలయితే ఫరవాలేదు. రాత్రిపూట. కరెంటు వుందో లేదో? అయినా ట్రైను దిగేవాళ్ళు వుండరా? వున్నా క్వార్టర్స్ వాళ్లు వుంటారా? లేదంటే రిక్షాలో పోతే.. రిక్షా చుట్టూతిరగాలి. అయినా రిక్షా వాళ్ళనీ నమ్మకూడదేమో? తెల్లవారే వరకు స్టేషన్‌లో వుండిపోతే? నిద్దర వుండదు. అయినా అదేం చిన్న పల్లెటూరు కాదు, పెద్దపట్నం.

"ఏమిటండీ ఆలోచిస్తున్నారు? వేళకు భోజనం చెయ్యండి..." వసంత ఏదో చెప్తున్నాసరే నా బుర్రకెక్కలేదు. వసంత ఏమనుకుందో ఏమో 'నే చేరిన వెంటనే ఫోను చేస్తాకదా' ధైర్యం చెవుతున్నట్లుగా మాట్లాడింది.

ఆటో స్టేషన్ చేరింది. నేను టిక్కెట్లు తియ్యబోతే చేంతాడు క్యూ వుంది. లేడీస్ లైన్లో నిలబడి కొద్ది సేపట్లోనే వసంత టిక్కెట్టుతో వచ్చింది.

ప్లాట్‌ఫామ్ చేరాం. రైల్లోని పెట్టెలన్నీ చూశాను. వసంత విసుక్కుంటున్నట్టే వుంది. బాగా జనం వున్న బోగీ ఎక్కించి సీటుచూసి కూర్చోమన్నాను. వసంత కూర్చొంది. నేను ఎదురుసీట్లో కూర్చున్నాను. వసంత హమ్మయ్య అన్నట్టుగా ఊపిరి పీల్చుకుంది. నాకెందుకో కోపం వచ్చినా, వెళ్ళే ముందర తగువు దేనికని ఊరుకున్నాను.

ఆలస్యమయిన గౌహతి ఎక్స్‌ప్రెస్సు అంతకు ముందే వెళ్ళినందువల్ల మేమెక్కిన విశాఖ ఎక్స్‌ప్రెస్సును మరో అరగంటా గంటవరకు తీసేట్టు లేరు. పైగా టిక్కెట్ల కోసం క్యూలో నిల్చున్న వాళ్లేం తక్కువమంది కాదు. కదిలినా చైన్ లాగేయటానికి సిద్ధంగా వున్నట్లు అక్కడి వారి మాటల్ని బట్టి అర్థమయింది.

ఇంతలో ఘొల్లున నవ్వులు వినిపించాయి. పక్క బోగీలో కుర్రాళ్ళు. వారి మధ్యలో ఓ నడివయస్సు స్త్రీ. ఆమె ముందు కూరగాయల గంప వుంది. ఆ గంపని సీటు క్రిందకు తోస్తోంది.

"బాబూ కాలు తియ్యి...గంప కిందకి తోస్తాను. కాళ్లకి అడ్డం వుండదు..."

మేం కూర్చొన్న చోటుకి ఆ దృశ్యమంతా కనిపిస్తోంది. నాతో పాటే వసంత కూడా అటువైపు చూపుని నిలిపింది.

"ఇక్కడ మేమందరం కుర్రాళ్ళం...మగ వాళ్ళం కూచున్నాంగదా? ఆడదానివి వేరే ఆడోళ్ళ బోగీకి పోరాదూ! మగాళ్ళ మధ్య ఎందుకు?" ఒక కుర్రాడు కాళ్ళు తియ్యకుండానే అడిగాడు.

"ముందు కాలు తీతువూ... పిల్లడా" అంటూ అడ్డుగా వుంచిన అబ్బాయి కాళ్ళు ఒక చేత్తో పక్కకు నెట్టి గంపను మరో చేత్తో సీటు క్రిందికి తోసింది. కూరగాయలామె తన పని కానిచ్చేక "ఆ... వుప్పుడు కాలు సాపుకు కూకోవయ్యా" అనీ అంది.

ఆ కుర్రాడే కాదు మిగతా కుర్రాళ్ళ నోటి వెంట కూడా మాట రాలేదు. అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. కూరగాయలామె ఎవర్నీ పట్టించుకున్నట్టు లేదు. రోజంతా ఎండలో తిరిగి తిరిగి అలసిపోయిందేమో ముఖమంతా నల్లగా మాడిపోయివుంది. కళ్ళు కూడా బాగా లోపలికి పీక్కుపోయి వున్నాయి. పమిటతో ముఖం తుడుచుకుంది. తుడుచుకున్నాక ఊపిరి పీల్చుకుంది. అప్పుడు ఆ కుర్రాళ్ళందరివేపూ చూసింది. వారంతా ఆమె వంకే చూస్తున్నారు.

"ఏటి నానేటో తప్పూ నేరవూ సేసినట్టుగ అలగ సూస్తారేటి? నాను కూకున్నాకే కుర్రోళ్ళు మీరంతా వచ్చినారు. అందరం కలిసి ఎలిపోడం మానీసి, ఆడోల బోగికి నువ్వెళ్ళని... మీరనిగానంతే ఆడోళ్ళకి సపరేటుగ బోగీల్నేవు... నానెళ్ళలేను.... ముడుకులు సలుస్తున్నాయి.." అంటూ కూరగాయలామె తన రొండు చేతుల్తో తన రొండు ముడుకులూ నొక్కుకుంది. నా చూపు ఆమె పాదాల వరకూ పాకింది. ఆమె పాదాలకు తెగిన సేర్లుకి పిన్నీసులతో కలగలిపిన హవాయి చెప్పులున్నాయి. పాదాలకు మట్టెలున్నా అవి మట్టిలో కలిసిపోవడంచేత పట్టించి చూస్తే గాని ఆనవాళ్ళు దొరకవు.

"కూర్చో...కూర్చుంటే మాకేం? మగాళ్ళ మధ్యన గదా? అని చెప్పినాం, కదలకపోతే కూర్చో... మాకేం ఇబ్బంది లేదు..." మరో కుర్రాడు అన్నాడు.

"మీకు ఇబ్బంది గుండే నన్నెలి పొమ్మంతన్నారు. నాకే ఇబ్బందీ లేదు. మీరు 'మగోలంతా' వొచ్చి కూకున్నా సిగ్గు పడిపోడాకో... సిరసిరలాడ్డాకో... నాను మీ ఇళ్ళల్లంట పెరిగిన ఆడదాన్ని కాను. నలుగుర్ల తిరిగి నా రొండు కాళ్ళరిగి నోరెండిపోతే గాని పొట్టగడవదు... పొట్ట బాధ తప్పితే.. నాపక్కన కూసున్నదెవుడు ఆడా? మగా? ఇదేం

లేదు. మీకు ఎరికయే వుంతాది బాబుల్లారా...మీరనే కాదు, సేనామంది ఆడోళ్ళని బూబమ్మల్లాగ సూత్తారు. అడుగుతీస్తే ఆలింటి మగోలు ఎనకుంతారు. ఎక్కడికెళ్ళినా ఎంటే. ఎవుడాళ ఆడోల్ని సూత్తన్నారో... సెయ్యి తగిలిత్తారో... ఆమాట కొస్తే జిమ్మలు బడిపోను ఆలకి సెల్లీ తల్లీ వున్నా అంతే ముష్టిగండలు... వుండరా మనుషుల్ల అన్నిరకాలోళ్లు వుంతారు. అవన్నీ సూసుకుంతే ఆకు జరగదు. మావు వొప్పా వప్పం..." కూరగాయలామె మాట్లాడుతూనే వుంది.

కనపడని అదృశ్య హస్తమేదో నా వీపు మీద చరిచినట్టయింది.

"నీ పేరేమిటో గాని భలే మాట్లాడతావే?!" మరో కుర్రాడు అన్నాడు మాటల మధ్యలో.

"పేరేదయితేటి? అడిగావు కాబట్టి సెపుతున్నా. ఎంకాయమ్మ నా పేరు. ఊరు అనకాపల్లి. రోజా అనకాపల్లి నుంచి కూరగాయలు గంపతో తీసుకొని రావడం, ఈ వైజాగల తిరిగి పొద్దుగూకేలోపు అమ్మేడం. ఇదిగో ఇంతేలకి రైలెక్కితే మరొక్క గంటకి దిగిపోడం... బాగా మాటాడుతన్నానని ఆ బావన్నాడు. మాటయినా ఏదైనా బతుకు నేర్పిత్తాది. నీనొక్కదాన్ని గంపట్టుకోని రైలెక్కితే మొదట్లో అనిపించీదేమో గాని బయ్యమిప్పుడు లేదు. ఆడాళ్ళని రైలెక్కించడానికొచ్చిన మగోళు అటుకూకోమని ... ఇటు కూకోమని... అల్లాయాడోల పక్క కూకోమని... రైలెక్కించడాకొస్తారు... దింపడాకొస్తారు. దారి మధ్యలో కాపుకి మరొకడు వుంతాడు... ఇంతమందుంటేగాని ఆ యాడపిల్లకి పయానం పూరాలవదు. మరి మాకెలాగ..." చెపుతోంది కూరగాయలామె.

నేనెందుకో నాదృష్టిని వసంతవేపు తిప్పాను. వసంత నావేపు చూస్తోంది. దాగని చిరునవ్వు బుగ్గల్లో కనిపిస్తోంది. నేను మరొక్క క్షణం అలా చూడలేకపోయాను.

"మరి రాత్రిపూట ప్రయాణం, భయమెయ్యదా?" ఇంకో కుర్రాడు.

"భయం దేనికి? అయినా మీరేమంతే అన్నారు గాని బాబు... అన్నిటికి మగోడి మీద ఆడి దయమీద ఆదరవు పడితె ఎలాగ? ఒకపాలి వుంటాది, ఇంకోపాలి వుండదు. ఆడేటి, మగేటి? మడిసికి ముందు ధైర్నం కావాల. ఈ మగోళంతా ఆడోలుకి ధైర్నం లేకండా సేత్తన్నారు. ధైర్నం మగోళు సొత్తయినట్టు ఆడోల ఎనకాలే వుండి, ఆ ఆడోలికి ధైర్నం లేకుండా సేత్తన్నారు. నిజమే గావాల అనేసి సేనామంది ఆడోలు బెంగపడి బెంబేలయిపోతారు. మగ మడిసి లేపోతే నాను బతకడం మానేన్నా?" కూరగాయలామె మాట్లాడుతూనే వుంది.

నిజమే. ఆమెకు ఏ భయమూ లేనట్టే వుంది. అందుకు సాక్ష్యంగా ఇందాకటి కుర్రాళ్ళు ఆకతాయిగా లేరు. ఏదో కొత్త అనుభవాన్ని పొందినట్టు కనిపిస్తున్నారు.

నాకూ ఏదో అనుభవం మనసులోకి వచ్చినట్లు వుంది.

వసంత ఏమీ మాట్లాడలేదు. చిర్నవ్వుతో నా వంకే చూస్తోంది. నేనిప్పుడు పరాజితుడులా కాక ఏదో సత్యాన్ని స్వీకరిస్తున్నట్టు వసంత కళ్ళలోకి ధైర్యంగా చూడగలిగాను. వసంత ప్రయాణం గురించి నాకిప్పుడు ఏ బెంగా లేదు. అందుకు ప్రతీకగా తృప్తితో వసంత చెయ్యినొక్కాను.

ఇంతలో రైలు కూత. నేను రైలు దిగాను. కదుల్తున్న రైల్లోంచి వసంత నవ్వుతూ చెయ్యి వూపుతోంది. నేనూ ధైర్యంగా చేయి వూపాను.

*రచన : ఫిబ్రవరి 1994*

*ప్రచురణ : ఆదివారం ఆంధ్రజ్యోతి, 10-4-94*